# ముఖపరిచయము

## శ్రీ కవికొండల వెంకటరావు

"సింధియాలు" అనేవాండ్లు కొందఱు "ఇండియా" విభజనమూలంగా 'కరాచీ' ఆ ప్రాంతంనుండి తఱిమి వేయబడి వచ్చి వేసి కాందిశీకులై "భారత్" రాష్ట్రాలలో ముఖ్య పట్టణాలన్నింటనూ సర్దబడ్డ సంగతి లోక విదితం. ఇది పధ్నాలుగు భువనాల చరిత్రలోను నభూతో నభవిష్యతి! వారికి పట్టిన అవస్థే ఆంధ్రులకు గాని, అరవలకుగాని, మధ్యప్రదేశస్థులకు గాని, వింధ్యప్రదేశస్థులకు గాని, హిమాచల, ఘూర్జర, కురుక్షేత్ర ప్రజకు గాని తటస్థించి వున్నట్టయినా వారు వారు ఎంత అటమటించివుండేవారో — ఆస్తులు పోయి, ఆంధ్రులు పోయి, ప్రాలుమాలి, జీవచ్ఛవ ప్రైఖరులయి, ఆసేతు హిమాచల పర్యంతం కోతుల్లా కొంక నక్కల్లా, కొపడియుండే వారేమో? లేదు - రూపఱియుండేవారు.

అయినా కొలవాహిని వేయు వొంద్రు గుంద్రాతిని చుట్టి దానిమీద అకుపచ్చన బొడమింపకపోదు అనే ఆశకొద్దీ ఈ "సింధియా" తెగవారు పర్యటన గావిస్తూ, ఎక్కడికక్కడే వలసప్రజలైనారు. ఆ స్థైర్యము, ఆ గుండె నిబ్బరం, అందఱూ నేర్వవలసిందేనని నా తాత్పర్యము. ఆడా మగా అందఱూ వారు స్ఫురద్రూపులు. అయితే మన భాష వేఱు వారి భాష వేఱు. ఆచారాదులు కూడా విభిన్నం. మఱీన్నీ వారు గేళం విడిచి దేశంకాని దేశం వచ్చినా వదలిపెట్టనిది ఆచారమొక్కటే. ఆ ఆచారాన్ని అనుసరించి స్త్రీలు ఘోషా వీధుల్లో అవలంబించేరు. మఱీన్నీ సత్రముల్లో బస లలవడినప్పుడు ఆ ఘోషా ముసుగు నేకండువాగా ఎదుఱొమ్ములమీద, చెంగులు వీపున పడేలా విసరి వేసికొని విచ్చలవిడి వేడుకనుండేరు.

ఏ మనిషి అయినా అస్తమానం ఘోషాగానే వుంటే ఉక్కిరిబిక్కిరి అయిపోదూ? అప్పటప్పటి ఝషకిశోరాలు నీటిపైకి వచ్చి, గాలి పీల్చుకున్నట్లు దరిశనమిస్తూ, కోటేరుముక్కులు, చేరడేసి కళ్లు, తళుక్కుమను చెక్కుటద్దాలు మున్నైన వాటియొక్క సోయగము వారికీ వుందని చాటేరు. అయితే వారి భాష ముఖ్యంగా తెనుగునాట తెలియదు. వారు మాట్లాడుకుంటూంటే కోతుల కిచ కిచ అని అనుకోవలసిందే!

అంచేత ఏదైనా కూలిపని నాలిపని చెప్పి వారిచేత చేయిద్దామంటే వల్లగానిపని. కోతులకు నేర్పి చేయించగలుగుతున్నామా మనగోడలు కట్టడం, ఱుళ్ళాయిలు ఱుట్టడమూను? ఆలాగే వారూ మనదేశం వచ్చి ఎక్కడికక్కడే చతికిలబడి, చెట్లకేసి, పిట్లకేసి, విశేషం అక్కజంగా చూడ్డం అలవరుచుకోగలిగారేగాని, మనతోపాటు మనిషి మనిషి కలిసిపోయి అరమర లేకుండా వుండిపోయినట్టు వుండిపోలేకుండా ఉన్నారు వారందఱికీ ఒక అండ ఒక ఱుండ కల్పించలేకుండా వున్నాం మనం!

పైని వివరించిన అపూర్వ పూర్వచరిత్ర అంతా కలిగివున్న ఒకానొక మత్తకాశిని "సింధీ" కన్యక రెండు పాయల జడ ముందుకు వేసుకు కండువా చెంగులు వెనక్కు పణిచ్చుక చొక్కాను గుబ్బలయుబ్బెత్తులచే నబ్బురం గొల్పుతూ ఈ లోకమంతా ఒక మహాసత్రంగా తలపోసి తిరుగాడుతూ వుంది. ఎప్పుడైనా చూచారా మీ రామెను? పర్వతాలట్టుకు వనములట్టుకు కూడా పర్యటనం గావింపగల్గింది. ఆ పర్యటనమప్పుడు ఆమెకు కలిగిన ఒకానొక విపర్యయమే ఈ కథాంతర్భాగము.

నరులే కాకుండా వానరములు కూడా పాకిస్థాన్ నుండి తరిమి వేయబడినవని ఆమెకు తెలియదు. అసలు నరులన్నవారుకూడా ఎవ్వరు ఎవరినుండి విడిపోయినారో కూడా ఎఱుగదు అన్నా సత్యదూరం కాదు. తల్లి పిల్లనుండి, తాత మనమడినుండి, భార్య భర్తనుండి, ఈలా చెదరగొట్టబడ్డట్టయిపోయినారు, సింధీజాతి వారొకానొకప్పుడు. ఇప్పుడు వారినే కాందిశీకులని పిలుస్తూ వున్నారు ఇతర ప్రదేశాలవారు. మఱి కోతుల్ని గురించి విచారించేందుకు తావెక్కడ?

అయితే కోతులన్నవి పట్నవాసాల్నే అంటిపెట్టుకుండక, పల్లెటి పట్టులు అడవులు ఉద్యానవనాలు కూడా తిరుగుతూ వుంటాయి. కోతులనుండి మనుష్యులు సృష్టిపరిణామమందు పైకి తేలారు అనేది నిజమైనా కోతులు వనవాసమే అభిలషిస్తాయి స్వతస్సిద్ధంగా! కాని మనిషికిమల్లే సంఘప్రియులు సంసారప్రియులుకూడాను. ఈ సజాతీయ విజాతీయ పరామర్శలో నొక్కొక్కప్పుడు మనిషి మనిషిని ప్రేమించేకన్న కోతినే ఎక్కువగా ప్రేమించడం కద్దు. కోతిని పట్టుకుని మనుష్య లాటలాడిస్తూ వాటిని తమ మూపులమీద తలలమీదకూడా ఎక్కించుకుంటూవుండడం మన మందఱం ఎఱుగుదుము. మఱీన్నీ ఏనాడు మానవులు అనగా ఆడమానవులు, మగమానవులు కూడా ఎవరికివారే కోతులనుండి పై మెట్టు చూఱగొన్నారు అనేసిద్ధాంతం ప్రబలిపోయిందో ఆనాటినుంచి ఆడది మగవాని అర్ధశరీరంగా గాని, అస్థి సముద్భవంగా గాని అంగీకరించడం మానేసి, తనయొక్క 'స్వతంత్రప్రజ్ఞను, ప్రాధాన్యాన్ని చాటసాగింది. ఆమె కూడా మగవాళ్లను అనుసరించడం మానేసి కోతుల్నే తన పూర్వీకులుగా కోరుకోసాగింది. ఇది ప్రపంచ మంతటా సర్వసామాన్య ప్రతీతి అయినా భారతవర్షమందు, ముఖ్యంగా హిందూమతమందు, పవిత్రభావాన్ని కూడా ప్రసాదించింది.

అందువల్ల పాకిస్తాన్ వారు హిందూమతస్థులైన సింధీమనుష్యులనే కాకుండా, వారి దేవాంశసంభూతులైన కోతుల్ని కొండముచ్చుల్ని కూడా "భారత్" ప్రదేశాలకు తఱిమివేశారు! కాని కోతులన్నవి, కొండముచ్చులన్నవి, పైని వివరించిన రీతిని వనాంతరాలు, పర్వతోన్నతాలు, పట్టుకుని పోయినాయి. మనుష్యులన్నవారు పట్నాల్లో అడుక్కుంటూ, అంగళ్లు ఆశ్రయాలు ఏర్పాటులు గావించుకుంటూ, అనుకూల వాతావరణం ఏనాటికైనా తమకు తిరుగ అలవడక పోతుందా అని ఆశాపూరిత నయనాలతో వున్నారు.

'సింధీ' కాందిశీకులన్నవారు ఎంతగా పట్నవాసాలట్టుకు వాటినే తమ యునికిపట్టులుగా తలపోసి గుంపు గుంపులుగా వున్నారో ఇరుకుసందులంట, మురికిగొందులంట,—సింధీ కాందిశీక గోలాంగూలాలు "జంగిల్" అనగా "అడవి" మను

ష్యుల్లా చెట్లట్టుకు కొండలట్టుకు అంతగా చెల్లాచెదరయిపోయినాయి. వాటిని ఆనవాలు పట్టి పట్టుకోవడమంటే ఎవరి తరమూ కాదు, ఎంతో పెంచి పెద్దచేసిన వాండ్లకు తప్ప. — ఆ పెంచిన వాండ్లిప్పుడున్నారో లేరో? ఉంటే ఎక్కడున్నారో? కాని కాందిశీక గోలాంగూలాలు కాందిశీక నరమానవుల కంటె ఎక్కువ నూటిగా, ఎక్కువ శీఘ్రంగా తమలాంటి వారే దేశం వారైనా వానితో సమైకంగా వుండిపోగలవు. అలా ఉన్నాయి కూడాను. అందులో ఒక కోతిపేరు "రాంసేవక్!"

"రాంసేవక్" అన్న ఈకోతి మననాటు కోతులతో అవలీలగా కలిసిపోయి 'జంగిల్' ఉద్యానవనాలనుంచి, తోటమాలీలు వేసి పెంచిన ఉద్యానవనాలదాకా సంచారం చేస్తూ సాధారణపుదానిలాగుండి అసాధారణపు పను లొక్కొక్కప్పుడు చేస్తూ, పలుకుతూ కిచకిచలాడుతూ వుంటేది.

ఒకనాటి సమయమప్పుడు పైని వివరించిన సింధీ కన్య విహారింపవెళ్లిన ప్రకృతి సీమ నే, "రామ్‌సేవక్" వున్న కోతి జట్టున్ను వుండడం తటస్థించింది. ఆప్రకృతి సీమ నొకింత వర్ణించడం అసలు గాథకు అలస్యంగాదు అని అనుకుంటాను.

ఒకచోట అయిదు కొండలు పొడుగ్గా చైనాగోడలా వుండి వాటికి చేరి ఒక చెరువు ఏర్పడింది. ఈ చెరువు పొర్లును పొడిగించుకుంటూ ఒక చిన్న కాలువ పడమరగా అస్తమాద్రికా అన్నట్టు పోతుంది. ఆ కాలువ నీట ఓ చోట ప్రతిఫలిస్తూ, మూడు కొండలు పొడుగుపాటివి లోవ లేర్పడి కాపడతాయి. మళ్లీ అలా చుట్టి వస్తే చెరువు కొసచాయను ఒక దూరపు కొండల నునుపుసోయగం, ఒక దగ్గఱ కొండ కొస గరుకురాళ్ళు అన్నీ అదోచిత్రంగా రూపిస్తాయి. చెర్వు గట్టునంటి ఒక చిన్న తోట, ఇంకా కొండల మధ్య కోనల వరిసాగు. చెరువు పెంపు — సరాసరి మనుష్యులు తిరిగే జానపదప్రాంతమా అని అనిపిస్తుంది.

పగలెంత సందడిగా వుండెనో ఆనాడు అసురసంధ్య పడ్డంలో లోకమంతా అంత మాటు మణిగింది. పొలంమీద ఒక మనిషిగాని ఒక పిట్టగాని లేదు.

నేనన్నానే — ఆ కోతుల గుంపు నిర్భయంగా చెట్లుదిగి సంజచీకట్లో ఒక మడిలో అక్కడక్కడ తమ తోకలమీద వెను కాళ్లమీద కూర్చొని విశ్రాంతి తీసుకుంటూవున్నాయి. దూరపు చూపుకు అవి కదలని మెదలని చిట్టి పొదల్లా చుట్టు గుడిసెల్లా కాబడుతున్నాయి. నేనన్నానే — ఆ సింధీకన్య తన ముందేమున్నదీ కానక చూట్టూవున్న అపురూప ప్రకృతిని చూస్తూ గభాల్న మడిలోని ఒక కోతిమీద అడుగేసింది. ఆ కోతి "రాంసేవక్" అయి కిచకిచామని పైకి ఎగిరింది. — తక్కిన కోతులు వెంటవెంటనే - చీకటిగాదూ - దృష్టి ఆనకో తెరవుగానకో నెమ్మది నెమ్మదిగా పాకుతూ, కొన్ని పరుగెడుతూ, తోటలోని చెట్లు ఎక్కిపోయినాయి.

"రాంసేవక్" గావించిన ఎగురుకు కిచకిచకు ఉలిక్కి పడ్డట్టయి "సింధీ" కన్నె తన మేలిముసుగు కండువాలా వేసుకు చెంగులు వెన్ను తెంపుకుపడేలా చేసుకుంది. చుట్టూ అంతా ప్రకృతి! అంతా నిశ్శబ్దం! అంతా కనుచీకటి! "రాంసేవక్" ఒక్క ఉడాయున సింధీకన్య బుజమెక్కి ఆమె రెండు పాయిల జడకంటె తనతోక పొడుగన్నట్టు వేలాడేసి కన్యకామణి వీపు తట్టింది. "అరే దుష్మన్" అంటూ కన్యారత్నం కపిరత్నాన్ని క్రిందకు విదలించేసింది. విదలించడంలో కోతి స్వేచ్ఛాలింగనం కన్యను గావించి ఆమెయొక్క ఎగు ఓమ్ములు చెట్టు కాయలను తన్నినట్టు తన్నుతూ తాను వెనక్కుపడింది. పడిందిపడి వుండవచ్చా? ఉహుఁ! వుండక తిరుగ ఆమెకేసి, పిచ్చిపట్టినదానిలా పెరిగిపోయి మీదకు విరగబడసాగింది. సింధీకన్య "భాపూ! హేయ్" అని దాన్ని త్రోసిపుచ్చింది. కోతి కన్యకామణి బుగ్గలు రక్కి ఒక్కొమ్మడి కండువా చెంగులు పట్టుకు పండ్లతో నొక్కి పట్టసాగింది. అది తెలిసి మఱి ప్రయోజనం లేదనుకొని కన్యక తన ఆచార చిహ్నమైన చిట్టి ఉత్తరీయాన్ని అమాంతంగా సళ్లించింది. కోతి ఆ సళ్లింపుతో కండువా సమేతంగా వెనక్కుపడింది. పడి ఆ కండువాను తాను మేలిముసుగ్గా వేసుకుంది.

వెంటనే సింధీకన్య సిగ్గువిడిచి తను వొగ్గినట్టు వొగ్గి "ఓసి ముండా! నారాంసేవక్! టువే!" అని అన్నట్టు సింధీభాషను అని గట్టిగా ఆకోతిని కౌగిలించుకొని, "ఇన్నాళ్లు ఎక్కడికి పోయేవు? ఎక్కడున్నావు?" అని అడిగింది తన భాషను. ఆ భాష మనుష్యులదైనా మన ఆంధ్రుల కర్థంకాదు కాని ఆ కోతి కర్థమై — ఆ కొండవెంపు కోలనివెంపు, కొమ్మ లెక్కిపోయిన తోడి నాటుకోతులవెంపు గెంతింది. "అక్కడున్నావు టే? ఇక్కడున్నావు టే? అని ఆ కోతిని బుజ్జగిస్తూ సింధీకన్య "రాంసేక్"ను ప్రేముడి నెత్తుకుంది. కోతి ఇంకా మేలిముసుగు తన చుట్టూ వేసుకుంటూ కన్యకామణికి కూడా దాన్నే బురకాగా కైసేత గొలిపింది.

బురకాలో కోతి సర్దుకుని కన్యకామణి బుజమీ్మద బుజకీర్తిలా కూర్చుంది. కన్యకామణి ఆబురకా కండువాను అలా వొత్తిగించుకుంటూ కోతిని కొంచెం వంగి వినుమన్నట్టు దిగలాగి - "మన ఆవులు ఏమైనాయి? నీవు ఊరికే కూడా కూడా చెలగాటలాడేదానివి చిలక చిలక అది నీ కెక్కడైనా తిరుగ కనిపించిందా? మేకల్ని కొన్నింటిని పెంచేవాడు మా తండ్రి! వాటిని తిరుగ నీవు చూచినావా? నేను బయలుదేఱి వచ్చేటప్పటికి గోధుమచేను మొలకెత్తుతూ వుంది. ఈ పాటికి పంట పండి వెన్ను మీద నిగనిగలాడేని అనుకుంటాను 'మన సింధీ దేశాన్ని' గురించి అన్ని సంగతులు చెప్పవు నాకు? - అయ్యో! ఏడుస్తున్నావా? నాతో చెప్పడానికి - ఏడుస్తున్నావా?" అని అడిగి, తన మాటలు వింటూ జవాబు చెప్పలేక కళ్లమ్మట నీరు కారుస్తున్న కోతిని ఊరడిస్తూ, తానుకూడా తన దుఃఖభారహృదయాన్ని నిట్టూర్పుల నెత్తుకు దించుకుంటూ - కన్నీరు బొటబొట గార్చదొడగింది. ఆ వెఱ్ఱిపిల్లతోపాటు — ఆకాశము రంయ్‌ని మేఘావృతమై కొండల్ని కదలించినంత వాయువు వీచి వర్షపాతము గలిగించింది.

తతిమ్మా కోతు లేమైపోయినాయో గాని "రామసేవక్" మాత్రం సింధీకన్యక గొంతుకను, గట్టిగా గొలుసెట్టి కట్టుకొన్నట్టు తాను అంటి పెట్టుకుంటూ తోకచుట్టేసుకొన్నదై మేలిముసుగును చిరిగిన తెరచాపలా ఎగరవేసింది.

వారిరువురు ఏ తీరమైనా చేరుకున్నారో అసలు లేనేలేరో నాటికీ నేటికీ తెలియదు. ★

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ॥ గోదావరి.

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో., రాజమండ్రి